క్లుప్తంగా

హోంగార్డులకు సన్మానం


హోంగార్డులను సన్మానిస్తున్న సీపీ

ఖమ్మంక్రైం: ఉద్యోగ విరమణ పొందిన హోం గార్డులు తిరుమలరాజు, నాగయ్యలను సీపీ సునీల్‌దత్ పూలమాలలు, శాలువాలతో బుధవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు చేసిన సేవలను సీపీ ప్రత్యేకంగా కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ ఏసీపీ సుశీల్‌సింగ్, ఆర్‌ఐ సురేష్, హెడ్‌కానిస్టేబుల్ దత్తురామ్, హోంగార్డు ఆఫీసర్స్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు రఫీ, తదితరులు పాల్గొన్నారు.

రేణుకాచౌదరి ప్రమాణ స్వీకారంలో జిల్లావాసులు

ఖమ్మంఅర్బన్: కాంగ్రెస్ నాయకురాలు, కేంద్ర మాజీ మంత్రి రేణుకాచౌదరి రాజ్యసభ సభ్యురాలిగా బుధవారం ఢిల్లీలో ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమానికి ఖమ్మం నుంచి మంగళవారం మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మానుకొండ రాధాకిశోర్, నాయకులు వడ్డె బోయిన నరసింహారావు, లెనిన్, రాజా, గుర్రం శ్రీను, తమ్మిన్ని నాగేశ్వరరావు, వడ్ల మూడి సురేశ్, భూక్యా భాషా, ఎం.శివరాజ్, కె.పుల్లయ్య తరలివెళ్లారు. ప్రమాణస్వీకారం అనంతరం రేణుకాచౌదరిని సన్మానించారు.

రేపు కామేపల్లిలో క్రికెట్ టోర్నమెంట్

కామేపల్లి: కామేపల్లిలో కామేపల్లి యూత్ అసోసియేషన్ ఆధ్వర్యాన రేపు(శుక్రవారం)కామేపల్లి, కారేపల్లి, ఏన్కూర్, రఘునాథపాలెం, ఇల్లెందు మండలాల స్థాయి క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు టోర్నమెంట్ నిర్వాహకులు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రథమ బహుమతి రూ. 20 వేలు, ద్వితీయ బహుమతి రూ.10 వే లు అందించనుండగా.. ఆసక్తి కలిగిన క్రీడాకారులు తమ పేర్లు నమోదు చేసుకోవాలన్నారు.

మామిడి మేళా ప్రారంభం


అమ్మకాలను ప్రారంభిస్తున్న వనజీవి రామయ్య

ఖమ్మంవ్యవసాయం: ఖమ్మం పెవిలియన్ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన కార్బైడ్ రహిత మామిడి పండ్ల అమ్మకాలను పద్మశ్రీ వనజీవి రామయ్య బుధవారం ప్రారంభించారు. కామేపల్లి మండలం గోవింద్రాలకు చెందిన రైతు బానోత్ లక్ష్మణ్ నాయక్ తన క్షేత్రంలో పండించిన పలు రకాల మామిడి పండ్లను కార్బైడ్ రహితంగా మగ్గించి అమ్ముతున్నారు. ఏటా మాదిరిగానే ఈసారి ఏర్పాటుచేసిన ప్రదర్శనను వనజీవి రామయ్య ప్రారంభించగా.. రైతు లక్ష్మణ్ మాట్లాడారు. పలు రకాల మామిడి పండ్లు అందుబాటులో ఉన్నాయని, పది కిలోలు కొనుగోలు చేసిన వారికి కేజీ ఉచితంగా ఇస్తామని తెలిపారు.

రజబ్‌అలీ చిరస్మరణీయుడు

ఖమ్మంమయూరిసెంటర్: సుదీర్ఘకాలం శాసన సభ్యుడిగా ప్రజల సమస్యల పరిష్కారం కోసం కృషి చేసిన మహ్మద్ రజబ్ అలి చిరస్మరణీయుడని సీపీఐ జాతీయ సమితి సభ్యుడు బాగం హేమంతరావు అన్నారు. బుధవారం రజబ్ అలీ 28వ వర్ధంతి సందర్భంగా నగరంలోని గిరిప్రసాద్ భవన్‌లో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్, జిల్లా కార్యవర్గ సభ్యులు జమ్ముల జితేందర్‌రెడ్డి, యర్రా బాబు, పోటు కళావతి, తాటి వెంకటేశ్వరరావు, సీహెచ్.సీతామహాలక్ష్మి, మేకల శ్రీనివాసరావు, గాదె లక్ష్మీనారాయణ, ఇటికాల రామకృష్ణ, సాంబశివారెడ్డి, గాంధీ, బోడా వీరన్న, ఎస్‌కె.సైదా పాల్గొన్నారు.

ఖమ్మం రైతుబజార్, సమీకృత మార్కెట్

కూరగాయలు కేజీ ధర (రూ.ల్లో)		ఆకుకూరల కట్టలు (రూ.ల్లో)	
టమాట	24	బచ్చలికూర	5
వంకాయ	16		20
బెండకాయ	16	పాలకూర	2
పచ్చిమిర్చి	36		10
కాకర	36	చుక్కకూర	2
బీర	30		10
దొండ	20	తోటకూర	2
పొట్లకాయ	40		10
చిక్కుడు	66	గోంగూర	2
గోరుచిక్కుడు	40		10
క్యాబేజీ	26	మెంతికూర	3
క్యాలీఫ్లవర్	35		20
ఆలుగడ్డ	34	కొత్తిమీర	1
చామగడ్డ	40		30
క్యారెట్	36	పుదీన	1
క్యాప్సికం	70		20

-ఖమ్మం వ్యవసాయం

కాల్వొడ్డు, మోతీనగర్‌లోని గోళ్లపాడు చానెల్ ప్రాంతం



కలవరపెడుతున్న జల సంక్షోభం..!

నీటి ఎద్దడితో త్రీటౌన్ ప్రాంతం సతమతం

- ఇంకుడు గుంతలు లేక అడుగంటిన భూగర్భ జలాలు
- గోళ్లపాడు పంట కాల్వ సమయాన పుష్కలంగా నీరు
- కాల్వ ఆధునికీకరణతో వృథాగా పోతున్న నీరు
- ఇంకుడు గుంతలు నిర్మిస్తే సమస్యకు చెక్

ఖమ్మంగాంధీచౌక్: వర్షపు నీటిని ఒడిసి పట్టడం వల్ల భూగర్భజలాలు సమృద్ధిగా పెరిగి భవిష్యత్ తరాలకు నీటి కొరత రాకుండా ఉంటుంది. కానీ నగరంలోని త్రీటౌన్ ప్రాంతం నీటి ఎద్దడితో సతమతమవుతోంది. ఈ ఏడాది సాధారణ స్థాయిలో కూడా వర్షపాతం నమోదు కాకపోవడంతో జలాశయాల్లో నీరు లేకపోవడం, భూగర్భ జలాలు అడుగంటడంతో నీటి సమస్య ఏర్పడింది. నగరానికి వనరులు పుష్కలంగా ఉన్నప్పటికీ నీటి సమస్య ప్రజలను వేదిస్తోంది. తలాపున మున్నేరు, నాగార్జున సాగర్ ద్వారా పాలేరు నుంచి నగరానికి నీటి వనరులు ఉన్నా.. ఆయా జలాశయాల్లో నీరు అడుగంటడంతో తాగునీటి సమస్యను ఎదుర్కోవాల్సి వస్తుంది.

పంటభూములు.. నివాస స్థలాలుగా...

పూర్వం సాగర్ కాల్వకు అనుసంధానంగా గోళ్ల పాడు పంట కాల్వ ఉండేది. ఆ కాల్వ నగరం నడిబొడ్డు మామిళ్లగూడెం ప్రాంతం నుంచి రైల్వేట్రాక్ దాటి జిల్లా త్రీటౌన్ కలెక్టర్ నివాసం వెంట నుంచి సారథినగర్, జూబ్లీక్లబ్, కాల్వొడ్డు, మోతీనగర్, రంగనాయకుల గుట్ట, పంపింగ్‌వెల్ రోడ్, సుందరయ్యనగర్, ప్రకాష్‌నగర్, శ్రీనివాస్ నగర్ ప్రాంతాల మీదుగా మున్నేరు వాగులోకి చేరుతుంది. ఈనేపథ్యాన గోళ్లపాడు పంట కాల్వ పరీవాహక ప్రాంత భూముల్లో సాగు చేసిన పంటలకు సరిపడా నీరు లభించేది. కాలక్రమేనా పట్టణం అభివృద్ధి చెందడంతో పంట భూములు నివాస స్థలాలుగా మారడంతో పాటు గోళ్లపాడు కాల్వ మురుగు కాల్వగా మారింది. నగరంలోని మురుగు నీరు అధిక భాగం ఈ గోళ్లపాడు చానెల్ ద్వారా మున్నేరులోకి చేరుతుంది. కాగా, త్రీటౌన్‌లో గోళ్లపాడు మురుగు చానెల్‌ను గత ప్రభుత్వం ఆధునీకరించి ఈ చానెల్‌పై కాల్వొడ్డులో వీధి వ్యాపారుల ప్రాంగణం ఏర్పాటు చేశారు. రంగనాయకుల గుట్ట నుంచి పంపింగ్ వెల్ రోడ్, సుందరయ్యనగర్ ప్రాంతం వరకు పార్కులు, వాకింగ్ ట్రాక్‌లు ఏర్పాటు చేయడంతో పాటు మురుగు కాల్వను కూడా నిర్మించారు. అయితే పలుచోట్ల ఇంకా ఆధునీకరణ పనులు జరగాల్సి ఉంది.

ఆధునికీకరణ తర్వాతే సమస్య..

గోళ్లపాడు చానెల్ ఆధునికీకరణ తర్వాత త్రీటౌన్‌లోని పలు ప్రాంతాల్లో నీటి సమస్య తలెత్తింది. ఈ ఏడాది వర్షపాతం తక్కువగా ఉండటం కూడా ఓ కారణం కాగా, దీనికి తోడు వృథా నీరు, వర్షపు నీరు నూతనంగా నిర్మించిన ప్రధాన డ్రెయినేజీ ద్వారా నేరుగా మున్నేరులోకి చేరుతుంది. చానెల్ ఆధునికీకరణ పనులు ప్రజలకు సౌకర్యవంతంగా ఉన్నప్పటికీ వృథా నీరు ఎక్కడా భూగర్భంలోకి ఇంకకపోవడంతో ప్రస్తుతం నీటి సమస్య ఎదురవుతోంది. ప్రస్తుతం నీటి ఎద్దడి తారా స్థాయికి చేరడంతో ఈ ప్రాంతంలో బోర్లు, బావులు ఎండిపోయాయి. దీంతో కొందరు బోర్లను మరింత లోతుగా వేయించుకుంటుండగా, కొందరు నూతన బోర్లను వేసుకునే పనిలో ఉన్నారు.

గతంలో పుష్కలంగా నీరు..

గోళ్లపాడు పంట కాల్వగా, మురుగు కాల్వగా ఉన్న సమయాన ఆ కాల్వ పరీవాహక ప్రాంతంలో సమృద్ధిగా నీరు ఉండేది. మామిళ్లగూడెం, రైల్వే ట్రాక్, సారథినగర్, జూబ్లీక్లబ్, కాల్వొడ్డు, మోతీనగర్, రంగనాయకుల గుట్ట, పంపింగ్‌వెల్ రోడ్, సుందరయ్యనగర్, ప్రకాష్‌నగర్, శ్రీనివాస్ నగర్ ప్రాంతాల్లో నీటి సమస్య తలెత్తలేదు. ఈ ప్రాంతంలో పుష్కలంగా నీటి లభ్యత ఉండేది.

ఇంకుడు గుంతలతో భూగర్భ జలాలు పెంపు..

గోళ్లపాడు చానెల్ దాదాపు 50 నుంచి 60 అడుగుల వెడల్పుతో ఉంటుంది. ఈ చానెల్ పొడవునా ఉన్న పలు ప్రాంతాల్లో పార్కులు, వాకింగ్ ట్రాక్‌లను నిర్మించగా.. పలుచోట్ల ఇంకా నిర్మాణ పనులు జరగాల్సి ఉంది. అపార్ట్‌మెంట్లు, గృహాలు, దుకాణ సముదాయాలు, ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలు ఉన్న ఈ ప్రాంతం నుంచి వర్షపు నీరు, వృథా నీరు అధికంగా ప్రవహిస్తుంది. గోళ్లపాడు చానెల్ వెడల్పుగా ఉండడంతో పలుచోట్ల ఇంకుడు గుంతలు నిర్మిస్తే భూగర్భ జలాలు సమృద్ధిగా ఉంటాయని ఈ ప్రాంత ప్రజలు కోరుతున్నారు. ఇప్పటికైనా పాలకులు ప్రణాళికలు చేపట్టి నిర్మాణాలు చేస్తే నీటి సమస్య తలెత్తదని పలువురు అభిప్రాయపడుతున్నారు.

ఇంకుడు గుంతలు నిర్మించాలి..



త్రీటౌన్‌లోని గోళ్లపాడు చానెల్‌పై ఇంకుడు గుంతలు నిర్మిస్తే నీటి సమస్యకు పరిష్కారం లభిస్తుంది. చానెల్ పొడవునా అనేక ప్రాంతాల్లో ఇంకా అభివృద్ధి పనులు చేయాల్సి ఉంది. ఈ పనుల్లో భాగంగా పలుచోట్ల ఇంకుడు గుంతలు నిర్మించే విధంగా ప్రభుత్వం దృష్టి సారిస్తే భవిష్యత్‌లో ప్రజలకు ప్రయోజనకరంగా ఉంటుంది.

–బజ్జూరి రమణారెడ్డి, మోతీనగర్, త్రీటౌన్

నీటిని వృథా కానివ్వొద్దు..



గోళ్లపాడు చానెల్ పరీవాహక ప్రాంతం నుంచి వర్షపు నీరు, వృథా నీరు మున్నేరులో కలుస్తుంది. ఆ నీరు ఎక్కడికక్కడ ఆవాసాల మధ్య భూగర్భంలోకి చేరే విధంగా ఇంకుడు గుంతలు వంటి చర్యలు చేపడితే భూగర్భ జలాలు రక్షించబడతాయి. ఆ దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటే నీటి ఎద్దడి సమస్య పరిష్కరించబడుతుంది.

– సోమారపు సుధీర్‌కుమార్, ప్రకాష్‌నగర్, త్రీటౌన్

ఎన్నికల సహాయక కేంద్రం ఏర్పాటు


సమావేశంలో మాట్లాడుతున్న ఆర్‌ఓ రాజేశ్వరి

ఖమ్మంరూరల్: లోక్‌సభ ఎన్నికలు 2024 సహాయక కేంద్రాన్ని రూరల్ తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసినట్లు పాలేరు నియోజకవర్గ ఆర్‌ఓ రాజేశ్వరి తెలిపారు. బుధవారం తహసీల్‌లో జరిగిన సమావేశంలో ఆమె వివరాలు వెల్లడించారు. ఈ కేంద్రంలో ప్రజలకు ఓటరు జాబితాలో పేరు, ఏ పోలింగ్ స్టేషన్‌లో ఓటు ఉన్నదీ లేనిదీ తెలుసుకోవడానికి, లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేయు అభ్యర్థులకు బ్లాంక్ నామినేషన్ పత్రాల పూరింపులో సలహాలు, సందేహాల నివృత్తి చేయబడుతుందని తెలిపారు. ఎన్నికల సంఘం నుంచి వచ్చిన నామినేషన్ పత్రాలు ఆన్‌లైన్‌లో డౌన్‌లోడ్ చేయకూడదని, నామినేషన్ పత్రాల్లో ఏమైనా తేడాలంటే సమస్యలు వస్తాయని చెబుతూ.. ఈ కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో అధికారులు తదితరులు పాల్గొన్నారు.

‘ఉపాధి’ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలి

ఖమ్మంరూరల్: ఉపాధి హామీలో పని చేస్తున్న కూలీల సమస్యలు పరిష్కరించాలని, ఉపాధి హామీ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ అనుబంధ అఖిల భారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర నాయకుడు బందెల వెంకయ్య అన్నారు. బుధవారం మండలంలోని కాచిరాజుగూడెంలో జరిగిన ఉపాధి హామీ కూలీ సమావేశంలో ఆయన మాట్లాడారు. కూలీలకు రోజుకు రూ.600 ఇవ్వాలని, పని ప్రదేశంలో తాగునీటి సౌకర్యం, నీడ కల్పించాలని, దూర ప్రాంతాలకు వెళ్లే కూలీలకు రవాణా చార్జీలు భరించాలని, 100 నుంచి 200 రోజుల వరకు ఒక్కో కూలీకి పని కల్పించాలని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న వేతనాలుచెల్లించాలని పిల్లలకు ఆయాలను ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో రెంటాల యాదగిరి, వెంకటేశ్వర్లు, కోటయ్య, వీరయ్య, సైదమ్మ, ఎం.వెంకన్న, అరుణ తదితరులు పాల్గొన్నారు.

‘ఉపాధి’ పనులు రెండు గంటలు ఆలస్యం


మంగాపురంతండాలో వేచి చూస్తున్న కూలీలు

నేలకొండపల్లి: మహాత్మా జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనుల పర్యవేక్షణ చేసే క్షేత్ర సహాయకుడు లేకపోవటంతో గ్రామంలో రెండు గంటల పాటు కూలీలు పని వద్ద పడిగాపులు కాయాల్సి వచ్చింది. మండలంలోని మంగాపురంతండా గ్రామానికి చెందిన ఉపాధి కూలీలు ప్రతీ రోజు దాదాపు 150 మంది వరకు పనులకు వస్తుంటారు. కానీ ఈ గ్రామంలో ఫీల్డ్ అసిస్టెంట్ లేకపోవడంతో గ్రామానికి చెందిన సీనియర్ మేట్‌కు పనుల పర్యవేక్షణ బాధ్యతను అప్పగించారు. కాగా, బుధవారం సదరు సీనియర్ మేట్ పనిమీద వేరే గ్రామానికి వెళ్లాల్సి వచ్చింది. దీంతో పని వద్ద తీయాల్సిన మస్టర్ ఫొటోలు తీసేందుకు సీనియర్ మేట్ లేకపోవడంతో దాదాపు రెండు గంటల పాటు కూలీలు పని వద్ద ఎండలో పడిగాపులు కాశారు. ఈ విషయం తెలుసుకున్న స్థానిక గ్రామపంచాయతీ సిబ్బంది ఒకరు వెళ్లి మస్టర్ ఫొటోలు తీయగా.. రెండు గంటల ఆలస్యంగా పనులు చేపట్టారు. ఈక్రమంలో గ్రామంలో ఇప్పటివరకు క్షేత్ర సహాయకుడిని నియమించకపోవటంపై అధికారుల నిర్లక్ష్యం అర్థమవుతుంది. గ్రామంలో పదేళ్ల పాటు ఫీల్డ్ అసిస్టెంట్‌గా పని చేసిన ఓ మహిళ కూడా ఉంది. కానీ అధికారులు నాకెందుకులే అన్నట్లుగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా తగు చర్యలు తీసుకోవాల్సిన పలువురు కోరుతున్నారు.

‘ఉపాధి’ కూలీకి గాయం..

కామేపల్లి: మండలంలోని లాల్యతండా గ్రామానికి చెందిన లావుడియా సక్రు అనే వ్యక్తి ఉపాధి పనుల్లో భాగంగా బుధవారం స్థానిక అటవీ ప్రాంతంలోని ఊర కాల్వ పనులు చేస్తున్నాడు. ఈక్రమంలో ప్రమాదవశాత్తు కాలుకి గడ్డపార తగలడంతో తీవ్రగాయం కాగా ప్రథమ చికిత్స అందించి 108లో ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

సమస్యాత్మక గ్రామాల్లో సీఆర్‌పీఎఫ్ కవాతు


కాకరవాయిలో సీఆర్‌పీఎఫ్ జవాన్ల కవాతు

తిరుమలాయపాలెం: పార్లమెంట్ ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు మండలంలోని సమస్యాత్మక గ్రామాల్లో సీఆర్‌పీఎఫ్ సిబ్బందితో బుధవారం పోలీస్ కవాతు నిర్వహించారు. మండలంలోని కాకరవాయి, బచ్చోడు, బచ్చోడుతండా, బీరోలు, పిండిప్రోలు గ్రామాల్లో కవాతు నిర్వహించి ప్రశాంత ఎన్నికలకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్సై గిరిధర్‌రెడ్డి, తహసీల్దార్ పీ.వీ. రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

108 కలశాలతో పూజలు


పూజలు చేస్తున్న అర్చకులు

ఖమ్మంఅర్బన్: నగరంలోని 4వ డివిజన్ బాలాజీనగర్‌లోని స్వయంభు శ్రీ అభయ వేంకటేశ్వరస్వామి 20 వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం 108 కలశాలతో స్వామివారికి అభిషేక పూజలను ఘనంగా నిర్వహించారు. స్వామివారికి నిత్యారాధన, మూలవరుకలు అష్టోత్తర శతకలశ స్నపన పూజలను భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు. అలాగే బుధవారం రాత్రి దేవాలయంలో కుంకుమ పూజలు నిర్వహించారు. దేవాలయ కమిటీ అధ్యక్షుడు బొల్లి కొమరయ్య, ప్రధాన కార్యదర్శి పురం తిరుపతయ్య, కోశాధికారి మలుసూర్‌నాయక్, గౌరవ సలహాదారులు పల్లెబోయిన చంద్రయ్య, దండా జ్యోతి రెడ్డి, మేకల వీరన్న, బెల్లి కొండలు, అయితేనబోయి న వెంకటేశ్వర్లు, బందు వెంకటేశ్వర్లు, గుగులోత్ మణికంఠ, అల్లిక ఆంజయ్య, వీరబాబు, పల్లపు సత్యం, తదితరులు పాల్గొన్నారు.

డబ్బు, మద్యానికి ఓటు అమ్ముకోవద్దు..



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న కమిటీ బాధ్యులు

ఖమ్మం మామిళ్లగూడెం: డబ్బు, మద్యానికి ఓటు అమ్ముకుంటే బతికున్న శవంతో సమానం అని జై భారత్ జస్ట్ ఓట్ క్యాంపెయిన్ కమిటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఖదిజ్ఞాసి సత్యనారాయణ గోల, జై భారత్ బీసీ పోరాట వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఖదిజ్ఞాసి వీరన్న తెలిపారు. బుధవారం దీనికి సంబంధించిన పోస్టర్లను ఖమ్మం ప్రెస్‌క్లబ్‌లో ఆవిష్కరించిన సందర్భంగా వారు మాట్లాడారు.ధనప్రవాహం వెల్లువలా ప్రవహిస్తున్న ప్రస్తుత ఎన్నికల వ్యవస్థ ద్వారా నిరుపేద వర్గాల వారు చట్టసభల్లోకి అడుగు పెట్టే పరిస్థితి లేదన్నారు. ఈ కార్యక్రమంలో కోటయ్య, అశోక్‌గౌడ్, రాజారత్నం, సంజీవరావు, కోటయ్య తదితరులు పాల్గొన్నారు.

జార్జిరెడ్డి జీవిత చరిత్రను పాఠ్యపుస్తకాల్లో చేర్చాలి


నివాళులర్పిస్తున్న నాయకులు

తిరుమలాయపాలెం: జార్జిరెడ్డి జీవిత చరిత్రను పాఠ్యపుస్తకాల్లో చేర్చాలని, జార్జిరెడ్డి, కానూరి తాతా స్ఫూర్తితో మతోన్మాదాన్ని ఓడించడమే వారికి ఇచ్చే నిజమైన నివాళి అని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గడ్డం శ్యామ్ పిలుపునిచ్చారు. బుధవారం మండలంలోని కాకరవాయి గ్రామంలో ఉస్మానియా అరుణతార జార్జిరెడ్డి, కళాతపస్వి కానూరి తాతా వర్ధంతుల సందర్భంగా గ్రామ సెంటర్‌లో పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నాడు జార్జిరెడ్డిని ఏ మతోన్మాదం హత్యగావించిందో నేడు అదే మతోన్మాదం కేంద్రంలో అధికారం చలాయిస్తూ ప్రజల మధ్య కులమత విభజన రేఖలు గీస్తుందని, అందులో భాగంగానే సీఏఏ,ఎన్‌ఆర్‌సీ చట్టాన్నీ తీసుకొచ్చిందని ఆరోపించారు. నూతన జాతీయ విద్యావిధానం పేరుతో విద్యారంగాన్ని పూర్తిగా కాషాయకరించి, కార్పొరేటీకరణ చేస్తూ పేద మధ్యతరగతి విద్యార్థులకు విద్యను అందని ద్రాక్షగా మార్చుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దేశ ప్రజల మౌలిక సమస్యలను గాలికొదిలి అయోధ్య రామమందిరం పేరా పబ్బం గడుపుతున్నారని తెలిపారు. తక్షణమే జార్జిరెడ్డి జీవిత చరిత్రను పాఠ్య పుస్తకాల్లో చేర్చాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ గ్రేటర్ హైదరాబాద్ ప్రధాన కార్యదర్శి కంచనపల్లి శ్రీను, ఓయూ నేత గణేష్, విద్యానగర్ డివిజన్ ప్రధాన కార్యదర్శి ఆసిఫ్, మండల కార్యదర్శి రవితేజ, వంశీ, అనూష, కాకరవాయి గ్రామ నాయకులు వీరబోయిన నాగలింగం, కుంభం మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

ముందస్తు ప్రవేశాలను అడ్డుకున్న పీడీఎస్‌యూ

ఖమ్మంమయూరిసెంటర్: రాష్ట్ర ప్రభుత్వం 2024–25 విద్యాసంవత్సరానికి అనుమతి ఇవ్వకుండానే ప్రైవేట్ కళాశాలలు ప్రవేశాలు నిర్వహిస్తున్నాయని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు లక్ష్మణ్, వెంకటేష్ ఆరోపించారు. బుధవారం ఖమ్మంలో ప్రవేశాలు నిర్వహిస్తున్న ప్రైవేట్ కళాశాల సిబ్బంది, పీఆర్‌ఓలను పీడీఎస్‌యూ నాయకులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ముందస్తు ప్రవేశాల పేరిట విద్యార్థుల నుంచి కొన్ని ప్రైవేట్ కళాశాలలు అధిక ఫీజులు వసూలు చేస్తున్నాయని, ప్రధాన కూడళ్లలో ఫ్లెక్సీలతో మోస పూరిత ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా ముందస్తు ప్రవేశాలకు పాల్పడుతున్న ప్రైవేట్ కార్పొరేట్ జూనియర్ విద్యాసంస్థలను గుర్తించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ నాయకులు సందీప్, అనిల్, పృథ్వి పాల్గొన్నారు.

‘కానూరి’ ఆశయాలను కొనసాగిద్దాం..

ఖమ్మంమయూరిసెంటర్: అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య వ్యవస్థాపకుడు కానూరి వెంకటేశ్వరరావు తన కళ రూపాలు, రచనల ద్వారా అసమానతల వ్యవస్థ మార్పు కోసం పోరాడి అమరత్వం పొందారని, ఆయన ఆశయాల కోసం పోరాడాలని అరుణోదయ రాష్ట్ర అధ్యక్షుడు నాగన్న అన్నారు. బుధవారం ఖమ్మంలోని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ కార్యాలయంలో కానూరి వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాగన్న మాట్లాడుతూ.. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో అనేక ఆటపాటలతో ప్రజలను చైతన్యపరిచారని అన్నారు. ఈ కార్యక్రమంలో పౌర హక్కుల సంఘం నాయకులు విప్లవకుమార్, అరుణోదయ జిల్లా కమిటీ సభ్యులు మహేష్, నాగేశ్వరరావు వెంకన్న, మస్తాన్, భాను తదితరులు పాల్గొన్నారు.

తండ్రీకొడుకులపై దాడి

నేలకొండపల్లి: తండ్రీకొడుకులపై ఓ యువకుడు దాడి చేసిన సంఘటన మండలంలోని అమ్మగూడెం గ్రామంలో చోటు చేసుకుంది. బాధితుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన అడపాల అంజయ్య, ఆయన కుమారుడు రమేష్‌లను అదే గ్రామానికి చెందిన శేషు అనే యువకుడు బుధవారం వారి ఇంటికి వచ్చి అసభ్యకరంగా దూషించి తండ్రీకొడుకులపై దాడి చేశాడు. భూ పంచాయతీని దృష్టిలో ఉంచుకుని తమపై దాడి చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇరువురిని స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రథమ చికిత్స చేయించారు. బాధితుల ఫిర్యాదు మేరకు విచారించి కేసు నమోదు చేయనున్నట్లు ఎస్సై తోట నాగరాజు తెలిపారు.

విజయవంతం చేయాలి


మాట్లాడుతున్న బొంతు రాంబాబు

ఖమ్మంమయూరిసెంటర్: అఖిల భారత కిసాన్ సభ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు పిలుపునిచ్చారు. బుధవారం ఖమ్మం సుందరయ్య భవన్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రపంచ ఖ్యాతిని పొందిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం, బెంగాల్ తెబాగ రైతాంగ పోరాటం, కేరళ ఉన్నప్ప వాయిలార్ రైతాంగ పోరాటం, మహారాష్ట్ర వర్లి ఆదివాసీ గిరిజన రైతాంగ పోరాటాల్లో అఖిల భారత కిసాన్ సభ భాగస్వామి అన్నారు. కార్పొరేట్ వ్యతిరేక పోరాట దినోత్సవంగా కిసాన్ సభ ఆవిర్భావ దినోత్సవాన్ని రైతులు ఘనంగా నిర్వహించాలని కోరారు. తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు మాదినేని రమేష్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షుడు తాతా భాస్కర్‌రావు, వాసిరెడ్డి ప్రసాద్, దుగ్గి కృష్ణ, చింతనిప్పు చలపతిరావు, ఊరిడి సుదర్శన్ రెడ్డి, తుళ్లూరు రమేష్ పాల్గొన్నారు.

నియోగి బ్రాహ్మణుల ఉగాది ఉత్సవాలు


పంచాగాన్ని ఆవిష్కరిస్తున్న సంఘ ప్రతినిధులు

ఖమ్మంగాంధీచౌక్: నగరంలోని మామిళ్లగూడెం సంఘం కార్యాలయంలో నియోగి బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యాన మంగళవారం రాత్రి ఉగాది ఉత్సవాలను జరుపుకున్నారు. సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కోసూరు ప్రసాద్, గెంటేల శ్రీనివాసరావుల ఆధ్వర్యాన జరిగిన ఈ కార్యక్రమంలో వివిధ ప్రాంతాలకు చెందిన నియోగి బ్రాహ్మణులు హాజరయ్యారు. ఈనేపథ్యాన పరిమి అనంతలక్ష్మి బృందం పాల్గొని సందడి చేయగా.. మామిడి తోరణాలతో కార్యాలయాన్ని అలంకరించి షడ్రుచులు, పులిహోర, రవ్వ లడ్డూలను పంపిణీ చేశారు. శ్రీ క్రోధి నామ సంవత్సర పంచాంగాన్ని సంఘ ప్రతినిధులు ఆవిష్కరించగా.. అనుభవజ్ఞులు పంచాంగ శ్రవణం వినిపించారు. ఈ సందర్భంగా నియోగి బ్రాహ్మణులు బనిగండ్లపాడు అప్పారావు, బసవరాజు ఉపేందర్‌రావు, మాదిరాజు బోస్, గోళ్ల మూడి సత్యనారాయణ శర్మ, మాటూరి లక్ష్మీ నారాయణ, ఊటుకూరి చంద్రశేఖర్ తదితరులను శాలువాలతో సత్కరించారు. సంఘం గౌరవ అధ్యక్షులు మంత్రప్రగడ జగన్మోహన్‌రావు, వర్కింగ్ ప్రెసిడెంట్ గోళ్లమూడి మల్లిఖార్జునరావు, ఉపాధ్యక్షుడు చకిలం జనార్దన్, కోశాధికారి నామవరపు పరమేశ్వరరావు, సహాయ కార్యదర్శి ఈశ్వరప్రగడ రామారావు, నిర్వహణ కార్యదర్శి ఎం.సంతోష్‌కుమార్, మాదిరాజు హరీష్ తదితరులు పాల్గొన్నారు.

రంజాన్ కిట్ల పంపిణీ


రంజాన్ కిట్లు పంపిణీ చేస్తున్న అసద్, ప్రదీప్

ఖమ్మం మామిళ్లగూడెం: రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని మార్కజుల్ దావత్ వాల్ ఇర్షద్ ధార్మిక సంస్థ సహకారంతో ఖమ్మంలోని అవాసు–ఇ–హింద్ వెల్ఫేర్ అండ్ చారిటబుల్ ట్రస్ట్, ఖమ్మం బీకే బజార్‌లోని మస్జిద్–ఇ–జైన్ ఉల్ ఆబిదీన్‌లో ట్రస్టు చైర్మన్ ఎండీ జవ్వాద్ అహ్మద్ ఆధ్వర్యాన బుధవారం రంజాన్ కిట్లను పంపిణీ చేశారు. ముస్లిం హక్కుల పోరాట సమితి ఉమ్మడి రాష్ట్ర ఉపాధ్యక్షుడు, ప్రముఖ విద్యావేత్త ఎండీ అసద్, ప్రముఖ చిన్న పిల్లల వైద్యుడు కూరపాటి ప్రదీప్‌లు ముఖ్య అతిథులుగా పాల్గొని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నగర అధ్యక్షుడు ఎండీ జావీద్, చోటేబాబా, సయ్యద్ అన్వర్, ఎండీ సాజిద్ షరీఫ్, ఎండీ అబ్దుల్ ఖదీర్ తదితరులు పాల్గొన్నారు.

నేలకొండపల్లిలో..


సేమియాలు పంపిణీ చేస్తున్న పుల్లయ్య

నేలకొండపల్లి: మండలంలోని రాజేశ్వరపురంలో దండా సీతమ్మ– గోపయ్య మెమోరియల్ ట్రస్టు ద్వారా ఆయన కుమారుడు.. గ్రామ తాజా మాజీ సర్పంచ్ దండా పుల్లయ్య చేతుల మీదుగా ముస్లింలకు సేమియా, పంచదార, ఇతరత్రా వస్తువులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ దండా నరసింహారావు, యలమద్ది లెనిన్, దండా నవీన్, వీరవెల్లి వేణు, ముస్లిం పెద్దలు షేక్.సాందుమియా, దస్తగిరి, సిద్దయ్య, గఫార్, అఫ్జల్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో రంజాన్ వేడుకలు


రెజొనెన్స్ ఇన్ఫోలో రంజాన్ వేడుకలు

ఖమ్మం సహకారనగర్ : నగరంలోని పలు ప్రైవేటు పాఠశాలల్లో రంజాన్ వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలల యాజమాన్యాలు రంజాన్ ప్రాధాన్యతను విద్యార్థులకు వివరించారు. అనంతరం రంజాన్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.